
వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

సోమవారం 10 ఫిబ్రవరి 2025


## సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమిపూజ

రాయచోటి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



మండలంలోని సిభ్యాల మల్లాయకుంటపల్లె మల్లేశ్వరుని ఆలయానికి రోడ్డు నిర్మించేందుకు మంత్రి ఆదివారం సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలవలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మల్లాయకుంటపల్లెలోని మల్లేశ్వరుని ఆలయానికి సిమెంటు రోడ్డు నిర్మించేందుకు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తులసిమాల అలంకరణలో శ్రీలక్ష్మినరసింహాస్వామి

మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



మదనపల్లెలోని అనపగుట్టలోని శ్రీవారినగర్‌లో వెలసిన శ్రీలక్ష్మి నరసింహాస్వామి ఆదివారం తలుసీమాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వేకువజామున స్వామివారిని తులసిమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు, అభిషేకాలు, గంధంతో పూజలు నిర్వహించి ఆలయానికి వచ్చే భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామివారి కృపకు పాత్రులను చేశారు.

# 'గల్లీ' క్రికెట్‌కే దిక్కులేదు... ప్రతిభ ఎలా బయటపడేది?

**నాడు మిథాళి రాజ్... నేడు గొంగడి త్రిష..**

**మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే వ్యవస్థ ఏది?**

**పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలోనే 'కోచ్'లకు దిక్కులేదు!!**

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:



మట్టిలో మాణిక్యాలంటారు కానీ ఆ మాణిక్యాలను వెలికి తీసే వ్యవస్థ లేదు. పట్టణాల నుంచే కాదు గ్రామీణ ప్రాంతాల్లో కూడ నేడు క్రికెట్‌కు ఊహించని ఆదరణ లభిస్తోంది. ఫలితంగానే అండర్-19 ప్రపంచ కప్ విజేతగా భారత్ విజయం వెనుక మన తెలుగు బిడ్డ భద్రాచలం బాలిక గొంగడి త్రిషనే కారణం. ఇలాంటి త్రిషలు ఎంతమందో ఉంటారు. కానీ వారిని వెలికి తీసే వ్యవస్థ లేదు. గల్లి క్రికెట్ నుంచే నాటి ప్రపంచ మహిళా క్రికెట్‌లో ఒక వెలుగు వెలిగిన మిధాళి రాజ్ కానీ, నేడు మెరిసిన గొంగడి త్రిష కానీ ఇప్పుడు ప్రపంచ మహిళా క్రికెట్‌లో సంచలనంగా మారిన స్మృతి మందాన లాంటి ఎందరో మహిళా క్రికెటర్లు గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారే. దేశంలో క్రికెట్ అంటే ఎంత పిచ్చో ఏ గల్లిలో చూసినా మూడు స్టంప్‌లు పెట్టుకొని క్రికెట్ ఆడుతూ కనిపించే చిన్నారులు కనిపిస్తుంటారు. గల్లీ క్రికెట్‌లో ప్రతిభ చూపితేనే కదా రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరేది. నేడు ప్రపంచ క్రికెట్‌ను భారత క్రికెట్ బోర్డు శాసిస్తోందంటే అందుకు కారణం దేశంలో క్రికెట్ ఉన్న ఆదరణ వల్లే అన్నది మరచి పోవద్దు. క్రికెట్ అంటే పురుషులే కాదు మహిళలు కూడ ఉన్నారని మన ఉమ్మడి తెలుగు రాష్ట్రం నుండి నాడు మిథాలి రాజ్ చూపిన ప్రతిభ బాలికలు క్రికెట్ వైపు చూసేలా చేసింది. ప్రపంచ మహిళా క్రికెట్‌లో మిథాలి రాజ్ రికార్డు సృష్టించారు. అలాంటి స్ఫూర్తితోనే గొంగడి త్రిష కూడ అండర్-19ప్రపంచ కప్ ద్వారా ఒక్క సారిగా హీరోగా మారిపోయారు. అద్భుత ప్రతిభ పాటవాలతో ప్రపంచ క్రికెట్‌లో ఒక్కసారిగా మెరిశారు. రాత్రికి రాత్రే వచ్చిన మెరుపులు కావు ఇవి. గల్లి క్రికెట్ నుండి ఢిల్లీ దాకా తమ అపారమైన ప్రతిభను చూపుతూ ఒక్కో మెట్టు ఎక్కి అంతర్జాతీయ మహిళా క్రికెటర్‌గా ఎదిగారు. అండర్-19 ప్రపంచ కప్‌లో అధ్బుత ప్రతిభతో గొంగడి త్రిష ప్రధాని మోడితోనే శభాష్ అనిపించుకున్నారు. ఈ విధంగా మహిళా క్రికెట్‌పై ఒక్క సారిగా బాలికలు కూడ మోజు పడేలా త్రిష మెరిసిందని చెప్పవచ్చు. ఏది ఏమైనా క్రికెట్ అంటే చెవి కోసుకునే, రక్తం పూసుకునే గుండె పైన తమ ఆటగాళ్ల టాటూలు వేయించుకునే దేశం మనది. అలాంటి క్రికెట్‌ను ఆరాధించే వారు చాలా మంది ఉన్నారు. అయితే గ్రామస్థాయి నుంచి మిగతా క్రీడలతో పాటు క్రికెట్ అంటే మక్కువ చూపే విధ్యార్థులను వెతికి పట్టి సాన పట్టే వ్యవస్థ మనకు లేదు. ప్రాథమిక విద్యార్థి దశ నుంచే క్రికెట్ పట్ల ఆసక్తి చూపే విధ్యార్థులను ఎంపిక చేసి కోచింగ్ ఇచ్చే పరిస్థితి లేదు. ప్రాథమిక హైస్కూల్ స్థాయిలో పనిచేస్తున్న పీఈటీలు అధిక శాతం మొక్కుబడిగా పనిచేస్తున్నా వారే. ఫలితంగానే క్రీడల పట్ల ఆసక్తి పోతుంది. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తిని గమనించి వ్యక్తిగత శ్రద్ధతో కృషి చేస్తే తప్ప మిధాలి రాజ్, గొంగడి త్రిష లాంటి ప్రతిభ కలిగిన వారు రాలేదు. పెద్ద పెద్ద క్రీడా మైదానాలు ఉన్న చోట, ఇండోర్ స్టేడియం అందుబాటులో ఉన్న చోట కోచ్‌లు లేని పరిస్థితి మనది. ఉదాహరణకు పార్లమెంట్, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రాజంపేటలో కోచ్ కూడ లేరంటే ఇంకా మనం క్రీడల్లో రాణించే వారిని ఎలా పట్టుకోగలం. క్రీడలను పర్యవేక్షించే శాప్ కోచ్‌లను వారే తమ జీతాన్ని కూడ విధ్యార్థులకు శిక్షణ ద్వారా జీతం తీసుకోవాలనే నిబంధన పెట్టడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. కనీసం తాత్కాలిక ప్రాతిపదికన అయినా ఇండోర్ స్టేడియం లాంటి వ్యవస్థలున్న క్రీడా మైదానాల్లో కోచ్‌లను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజంపేటలో ప్రతి రోజు క్రికెట్ ఆడేందుకు చిన్నా, పెద్ద తేడా లేకుండా పెద్దఎత్తున మైదానానికి వస్తుంటారు. ప్రధానంగా సెలవుల రోజున చిన్నారులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారిలో ఉన్న నైపణ్యాన్ని పసిగట్టి తీర్చిదిద్దితే కదా మంచి క్రీడాకారులుగా ఎదిగేది. కోచ్‌లే లేనప్పుడు అలాంటి పరిస్థితి ఎలా సాధ్యం అవుతుంది. ఇకనైనా పరిస్థితి మారాలి. అప్పుడే మిధాళి రాజ్, స్మృతి మందాన, గొంగడి త్రిష లాంటి ప్రతిభ కలిగిన క్రీడాకారులు బయటికి వస్తారు.



## భూసమస్యను అక్కడికక్కడే పరిష్కరించిన మంత్రి



రాయచోటి, ఫిబ్రవరి 9ప్రభాత వార్త

రాయచోటి మండలం, వరిగ గ్రామం, పాపిరెడ్డిగారి పల్లెకు చెందిన అబ్బవరం. నాగులమ్మ గతంలో వైసిపి నాయకులు తనకున్న 5 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని ఆదివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, గత ప్రభుత్వంలో వికలాంగులను సైతం లెక్కచేయకుండా నాగులమ్మ భూమిని ఆక్రమించుకున్న భూ ఆక్రమణదారుపై వెంటనే చర్యలు తీసుకొని ఆమె భూమి ఆమెకి ఇప్పించాలని మంత్రి తాసిల్దార్ కు ఫోన్ చేసి చెప్పడం జరిగింది. దీంతో నాగులమ్మ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తన భూ సమస్య పరిష్కరించడంతో ఆమె మంత్రివర్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## షూటింగ్ బాల్ క్రీడాకారుడు యూసఫ్‌కు ఘన సన్మానం.



తంబళ్లపల్లె ఫిబ్రవరి 9 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండల కేంద్రంలో డాక్యుమెంట్ రైటర్ గా పనిచేసే మస్తాన్ కుమారుడు షూటింగ్ బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్ భాష ను ఆదివారం స్థానిక పెద్దలు ఘనంగా సన్మానించారు. యూసఫ్ భాష షూటింగ్ బాల్ లో భారత జట్టు తరఫున నేపాల్ లో జరిగిన ఆసియా షూటింగ్ క్రీడల్లో పాల్గొని విజయం సాధించి బంగారు పతకం సాధించాడు. ఈ విషయమై యూసఫ్ భాషను ఉదయం తంబళ్లపల్లె కు చెందిన పెద్దలు, యువకులు దృశ్యాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి తంబళ్లపల్లె పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూసఫ్ భాష దేశ స్థాయిలో సాధించిన గోల్డ్ మెడల్ తంబళ్లపల్లె లోని ప్రతి ఒక్కరికి ఆదర్శమని కొనియాడారు.

## బీసీ రుణాల గడువు పొడిగింపు

దువ్వూరు, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల ధరఖాస్తు గడువును ఈ నెల 12వ తేది వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన పేదలందరికి అందజేయడమే లక్ష్యంగా లబ్దిదారుల నుండి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ గడువు పెంచిందన్నారు. ఇప్పటికే 300ధరఖాస్తులు వచ్చాయని ఫిబ్రవరి 12వరకు గడువు ఉందని అర్హులైన లబ్ది దారులు ఎవరైనా ఉంటే ధరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## 20మద్యం బాటిళ్లు స్వాధీనం

దువ్వూరు, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:

మండల పరిధిలోని యర్రబల్లె నుండి గొవులాపురం పొవు కామనూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 20మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. యార్రబల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి ప్రొద్దుటూరు పట్టణం నుండి మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకొని వస్తుండగా దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో అతని వద్ద ఉన్న సంచిలో 20మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

# నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు కృషి





**టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు**

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నానని టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. ఆదివారం పెద్ద కారంపల్లె గ్రామపంచాయతీలో ఈద్గా వద్ద సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. రాజంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా చేయడమే తన లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చంద్రబాబునాయుడు సారథ్యంలో మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందనన్నారు., ప్రతినిత్యం వారి సంక్షేమానికి, శ్రేయస్సుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగయ్యేందుకు ప్రభుత్వం తరఫున అనేక సంక్షేమ పథకాలు, చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. రాజంపేట నియోజకవర్గం మైనార్టీలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చమర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మండల అధ్యక్షులు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబుబకర్ , కౌన్సిలర్స్ మిరియాల చెంగమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షులు శివ నారాయణ చౌదరి, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయ దేవి, ముళ్ళగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, మాజీ మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ మైనారిటీ సీనియర్ నాయకులు గగ్గుటూరి ఖాదర్ భాషా, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్కె కరీమ్, పార్లమెంట్ అధికార ప్రతినిధి జగదాభి పాండురాజు, సింగన పరుశురాం నాయుడు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, తెలుగు యువత పట్టణ ప్రధాన కార్యదర్శి సుహేల్, మైనారిటీ నాయకులకు తుపాకుల భాషా, షేక్ జిలాని భాషా, తుపాకుల రసూల్, పట్టణ యువ నాయకుడు తేజాల ఆనంద్, మసీద్ అధ్యక్షులు షేక్ ఖాదర్బాషా, షేక్ జిలాని భాష, తదితరులు పాల్గొన్నారు.

# నేడు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

కడప, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పిల్లల ఆరోగ్యవంతమైన జీవనం కోసం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఫిబ్రవరి పదో తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, కౌమారులలో నులిపురుగుల సమస్యను అధిగమిం చడానికి 10.02.2025వ తేదిన"జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ"సందర్భంగా దేశ వ్యాప్తంగా 01 నుండి 02 సంవత్సరాలలోపు పిల్లలకు 200 మి.గ్రా. 03 నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలకు "ఆల్బెండజోల్" 400 మి.గ్రా. మాత్రలు పాఠశాలలు, కళాశాలలు అంగన్వాడి కేంద్రములలో మధ్యాహ్న భోజనం తరువాత వేయనున్నారు. పాఠశాలలకు వెళ్ళని పిల్లలు అంగన్ వాడి కేంద్రములలో వేయడం జరుగుతుంది. ప్రయోజనాలునులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు తీసుకో వడం ద్వారా కడుపులోని నులిపురుగులు తగ్గిపోతాయి. వీటిని నిర్మూలించడం వల్ల రక్తహీనతను నియం త్రణలోకి వస్తుంది. పోషకాహార అవసరాన్ని మెరుగుపరుస్తుంది. వ్యాధి నిరోధకత మెరుగవుతుంది. చదువుపై ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థం పెరుగుతుంది. పని సామర్థం కూడా పెరుగుతుంది. డి వార్మింగ్ డే రోజున అన్ని పాఠశాలలు అంగన్వాడి కేంద్రాలలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, (గోర్లు కత్తిరించుకోవడం, భోజనానికి ముందు, మల విసర్జన తరువాత చేతులు సబ్బుతో కడుక్కోవడం )కాళ్ళకు చెప్పులు ధరించడం, బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయకుండా మరుగు దొడ్లను వాడటం, వంటి అంశాలపై "ఆరోగ్యవిద్య" ద్వారా అవగాహన కల్పిస్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, అంగన్ వాడి కేంద్రాలలో 1 నుండి 19 సంవతరాలలోపు పిల్లలకు 10.02.2025వ తేదీన మరియు 17.02.2025 తేదిన నులి పురుగుల నివారణ మాత్రలు వెయ్యను న్నారు . వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, ఆశా కార్యకర్తలు మరియు అంగన్ వాడి కార్యకర్తలు, స్వయం సహాయక బృందాలు, కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ యన కోరారు. మాప్ అప్ డే ఫిబ్రవరి 17ఈనెల ఫిబ్రవరి 10తేదీన అనారోగ్య, గైర్హాజరు, ఇతర కారణాల వల్ల నులిపురుగు మాత్రలు వేసుకోని విద్యార్థులకు తప్పనిసరిగా మాప్ అప్ రోజు ఈ నెల ఫిబ్రవరి 17వ తేదీన నులిపురుగుల మాత్రలు వేయనున్నారు. నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. పిల్లల చేతివేళ్ల గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. వాటిలో మట్టి చేరకుండా చూసుకోవాలి. పరిశుభ్రమైన నీటినే తాగాలి. తినే ఆహారం కలుషితం కాకుండా మూతలు పెట్టాలి. సాధ్యమైనంత వరకు వేడిగా ఉన్న పదార్థాలే తీసుకోవాలి. ఈగలు, దోమలు ఆహారంపై వాలకుండా జాగ్రత్తపడాలి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను శుభ్రమైన నీటితో కడిగిన తర్వాతే వాడాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనను మానేసి మరుగుదొడ్ల వాడకాన్ని అలవాటు చేసుకోవాలి. మలవిసర్జన తర్వాత చేతులను సబ్బులతో బాగా కడుక్కోవాలి. పిల్లలు ఆటల సమయంలో, బయట తిరిగేటప్పుడు బూట్లు లేదా చెప్పులు ధరించాలి.

**చేయవలసినవి :** ఆల్బెండజోల్ మాత్రలు మధ్యాహ్నం భోజనం తర్వాత వేసుకోవాలి. 1 2 సంవత్స రాలలోపు పిల్లలు 200 మిల్లీ గ్రాముల మాత్రను క్రష్ (పగలగొట్టి) స్పూన్ వాటర్ లో కలిపి తాగించాలి., 319 సంవత్సరాల పిల్లలు 400 మిల్లీ గ్రాముల మాత్రను బాగా నమలి తగినంత నీరు తాగాలి. ఓ ఆర్ఎస్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి ఈ మాత్రలను పిల్లలకు అంగన్వాడి, పాఠశాలలు, కళాశాలలో ఆశ కార్యకర్త, టీచర్లు, అధ్యాపకులు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వేయించాలిఆల్బెండ జోల్ మాత్రలపై అంగన్వాడి, స్కూలు, కళాశాలలో పిల్లలకు ఖిఆరోగ్య విద్యఖి ద్వారా అవగాహన కల్పించాలిప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థుల యొక్క డైరీలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పొందుపరిచి, తల్లిదండ్రులకు తెలియజేయాలి. ఈ మాత్రను ప్రతి ఆరునెలలకోసారి వేసుకోవడం వల్ల నులిపురుగులు తగ్గిపోతాయి.

**చేయకూడనివి :** అనారోగ్య కారణాలు ఉన్న పిల్లలకు ఈ మాత్రను వేయరాదుఈ మాత్రను మింగాలని విద్యార్థులకు సూచించరాదు.(ఈ మాత్రం మింగకూడదు నమిలాలి)తడి మరియు ఎండ ప్రాంతాలలో ఈ మాత్రలు ఉంచరాదు ఈ మాత్రను పిల్లల చేతికిచ్చి ఇంటికి పంపరాదు.

## నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం).

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

రాయచోటి, ఫిబ్రవరి 09ప్రభాత వార్త

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 10న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మానికి రాగలరని తెలిపారు.




## ఎమ్మెల్యేచే వాటర్ ప్లాంట్ ప్రారంభం



**దువ్వూరు, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మీర్జఖాన్ పల్లె గ్రామంలో రూ.5లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ వాటర్ ప్లాంట్‌కు 2018లో అప్పటి ఎంపీ సీఎం రమేష్ నాయుడు 5లక్షలు మంజూరు చేశారు. వైకాపా పాలనలో దీనిని పట్టించుకోలేదు. తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటర్ ప్లాంట్‌ను నిర్మించి గ్రామస్థులకు మంచి నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అందులో భాగంగానే దీనిని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు శుద్ధి చేసిన మంచినీటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సంధర్భంగా ఆయన కొళాయిల ద్వారా బిందెలు నింపి మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్షుమయ్య, రవికుమార్, రఘునాథ్, రైతుసంఘం అధ్యక్షుడు సంజీవ రెడ్డి, ఉశేన్ సాహెబ్ పాల్గొన్నారు.

## కార్మికులకు, అసంఘటిత కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
స్థానిక పోరుమామిళ్ల లోని వివేకానంద భవనంలో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పోరుమామిళ్ళ ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవప్రసాద్ పూర్వపు ప్రైవేట్ ఎలక్ట్రిషన్ ప్రధాన కార్యదర్శి రఫీ ఇరువురు సంయుక్తంగా మాట్లాడుతూ భవన నిర్మాణం, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు యొక్క సంక్షేమ పథకాలు లబ్ది పొందుటకు వెంటనే కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు ఎలక్ట్రిషన్లు ప్రభుత్వ ద్వారా పొందిన గుర్తింపు కార్డులను ప్రతి సంవత్సరము రెన్యువల్ చేయించుకోవాలని,లేదా ఐదు సంవత్సరాలకు ఒక సారి రెన్యువల్ చేసుకోవాలన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రిషన్ లు పోరుమామిళ్లలో పెద్ద సంఖ్యలో ఉన్నారని వారు ప్రమాదా బీమా సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే గుర్తింపు కార్డులు పొందాలని దినదిన గండంగా ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు పనిచేసుకుంటూ జీవనం చేసే వారికి ప్రభుత్వము ఆదుకోవాలని వారికి పూచీ కత్తిలేని సబ్సిడీ రుణాలు ప్రభుత్వం అందించాలన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు ఐటిఐ ఎలక్ట్రిషన్ చేసి పట్టా పొంది ఉన్నటువంటి వారిని ప్రభుత్వం వెంటనే సబ్ స్టేషన్‌లో ఉద్యోగాలు కల్పించాలన్నారు. కార్మికుని కుమార్తె , కుమారుడు వివాహ కానుక లక్ష రూపాయలు కల్పించాలని, ప్రసూతి సహాయం కొరకు లక్ష రూపాయలు కల్పించాలన్నారు. క్యాన్సర్ గుండె ఊపిరితిత్తులు మొదలగు కార్మికులకు ప్రమాదబీమా 10 లక్షలకు పెంచాలని, సాధారణ మరణం చెందిన కార్మికునికి ఐదు లక్షల పెంపు కల్పించాలని దహన సంస్కారాలఖర్చులకు లక్ష రూపాయలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ గా షేక్ మాబు వలి కోకన్వీనర్‌గా కిరణ్ భాష హుస్సేన్ పీరా, సూరిబాబు, రఫీ, మల్లికార్జున, ఇమ్రాన్, హుస్సేన్ పీరా, మస్తాన్ భాష అల్లా మాలిక్ ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిషన్లు వెంకటరెడ్డి చిన్న, హుస్సేన్ పీరా, భాష, మాబు, బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
పోరుమామిళ్ల మండలం, ఈదుల్లపల్లె గ్రామం, ప్రస్తుతం కొత్త వీధి, పోరుమామిళ్ల టౌన్ లో నివాసం ఉంటున్న లక్కినేని కిరణ్ (40), తండ్రి ఫ్రాన్సిస్, అను అతను మద్యం మత్తులో శనివారం రాత్రి 11.00 గంటలకు తన ఇంటి లో ఫ్యాన్ కు తాడు తో ఉరి వేసుకుని చనిపోయాడు. ఆదివారం మృతుని భార్య ఈరి సునీత పిర్యాదు మేరకు పోరుమామిళ్ల ఎస్సై ఎస్ వి కొండా రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్



**పులివెందుల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**
నిరుపేదలకు వరం సిఎంరిలీఫ్ ఫండ్ అని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి అన్నారు. పులివెందుల పట్టణంలోని ఆమె స్వగృహంలో ఆదివారం లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని లబ్ధిదారులకు 12,73,438/ రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని ఆమె తెలిపారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం సహాయ నిధులు అందిస్తున్నారని కొనియాడారు. మీ కుటుంబానికి ఆసరాగా ఇంటి పెద్దగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తున్న గొప్ప మానవతావాది మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని బాధిత కుటుంబాల తరపున సీఎంకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యార్థులకు హైదరాబాద్ వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్

**సుందుపల్లి, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త :**
విశ్వం ఎడ్యుటెక్ వారు విజయవాడ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేదిక్ అబాకస్ టాలెంట్ పరీక్ష లలో వశిష్ట పాఠ శాల విద్యార్థులు సీనియర్ లెవెల్లో ఆఫ్సియా స్టేట్ 2 ర్యాంక్, యస్ రయాన్ స్టేట్ 2 ర్యాంక్, నవనీత్ 3 ర్యాంక్ నందకిశోర్ 3 ర్యాంక్ సాధించారు. చైతన్య పాఠ శాల విద్యార్థులు జూనియర్ లెవెల్‌లో ఒ పృథ్వి 2 ర్యాంక్, విహాన్ రాజ్ స్టేట్ 3 ర్యాంక్ సాధించడం జరిగినది. చైతన్య పాఠశాల ఒ. పృథ్వీ రాజ్ జాతీయ స్థాయి లో టాలెంట్ పరీక్ష కు సెలెక్ట్ కావడం జరిగింది. వశిష్ట పాఠశాల గణిత ఉపాధ్యాయులు నాగ వేణి,వెంకటేశ్వర్లు, విజయ కుమారి, చైతన్య పాఠశాల గణిత ఉపాధ్యాయులు అరుణ కుమారిలను ప్రత్యేకంగా కరస్పాండెట్ అభినందిచారు. వశిష్ట, చైతన్య పాఠశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. వశిష్ట, చైతన్య పాఠశాల చైర్మన్ డాక్టర్. కొండూరు రెడ్డెయ్యరాజు వశిష్ట, చైతన్య పాఠశాలలు అధ్యాపకులు పాల్గొన్నారు.

# పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక





**సిద్దవటం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
నాటి విద్యార్థులు కల్లా కపటం ఎరుగని క్రమశిక్షణతో చదువుకునే వారని పూర్వపు సిద్దవటం జడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1987-88 సంవత్సరం 10వ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల అపురూప కలయిక సమావేశ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించి వారు వారి పిల్లల స్థితిగతులను తెలుపుకున్నారు. అనంతరం పూర్వపు ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు మాట్లాడుతూ నేను సిద్దవటం హైస్కూల్లో పని చేయడం చాలలా సంతోష పడ్డానన్నారు. ఇది మా అవ్వగారి ఊరని నాతో పాటు పనిచేసిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు సహకరించారన్నారు. దీంతో తాను పాఠశాల అభివృద్ధి చేయాలని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులకు చదువు చెప్పడంలో వారిని క్రమశిక్షణలో పెట్టడంలో వారు బాగా సహకరించారన్నారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య ఉండేదన్నారు. ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులకు భయం, భక్తి ఉండేదన్నారు. దీంతో ఎంతో మంది విద్యార్థులు ప్రయోజకులై గొప్ప గొప్ప పదవుల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. మారిన టెక్నాలజీ కారణంగా విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్‌కు అలవాటు పడి చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల శ్రద్ధవహించాలని సూచించారు. పూర్వపు ఉపాధ్యాయులు బాల గురివిరెడ్డి, సిద్దారెడ్డిలు మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులను తాము కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం పూర్వపు ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు, ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములను విద్యార్థులు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం పూర్వపు విద్యార్థులు పాఠశాలకు వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకును ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములుకు అందజేశారు.

## అభివృద్ధిలో సిసి రోడ్డు నిర్మాణం



**సుండుపల్లి, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త :**
మండలంలో పెద్దబలిజపల్లి దగ్గర శివాలయం నుండి కుటా లమ్మ గుడి వరకు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం జనసేన రామా శ్రీనివాస్ భూమి పూజ చేసి గ్రామ పెద్దలతో కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించాడు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిధులు నేరుగా మంజూరు అయ్యాయని తెలిపాడు. ఈ కార్యక్రమం లో మండల ప్రభుత్వ అధికారి జె ఇ రాయుడు, మాజీ ఎమ్‌పిటిసి నంద్యాల రామయ్య, మాజీ వార్డు మెంబెర్ రామాంజులు, నాగరాజ, ఆంజనేయులు తాపీ మేస్త్రిలు పాల్గొన్నారు.

## అరటి తోట దగ్ధం ఎమ్మెల్యే పరిశీలన



**పుల్లంపేట ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త)**
విద్యుత్తు లైను వలన షార్ట్ సర్క్యూట్ రావడంతో దగ్ధమైన అరటి తోటను రైల్వేకోడూరు శాసనసభ్యుడు అరవ. శ్రీధర్ ఆదివారం పరిశీలించారు .వివరాల్లోకి వెళితే పుల్లంపేట మండలంలో టీ కమ్మ పల్లె పంచాయతీ కిష్టం పల్లి గ్రామంలో రైతు పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న పసుపులేటి రవికుమార్ అరటి తోట విద్యుత్తు లైను షార్ట్ సర్క్యూట్ రావడంతో ఆదివారం దగ్ధం అయింది. కిష్టం పల్లె గ్రామానికి చెందిన బుల్లి మేకల చంద్రశేఖర్కు అనే రైతు పొలాన్ని పసుపులేటి రవికుమార్ కౌలుకు తీసుకొని అరటి సాగు చేయడం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు రవికుమార్ 20 లక్షల రూపాయలు నష్టపోయారని తెలుసుకున్న రైల్వే కోడలు శాసనసభ్యుడు అరవ శ్రీధర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు ఈ విషయమై అధికారులతో ఆయన మాట్లాడడం జరిగింది సందర్భంగా ఆయన వెంట మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ కూటమినాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ పశుధ్దాన్ కవాచ్ స్కీమ్ సద్వినియోగం చేసుకోండి



**బద్వేలు రూరల్, ఫిబ్రవరి 9 , ప్రభాతవార్త**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంపూర్ణ పశుధ్దాన్ కవాచ్ స్కీమ్ సద్వినియోగం చేసుకోవాలని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ గూడూరు సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని జోగి రెడ్డి గారి పల్లె తిప్పనపల్లె తదితర గ్రామాలలో పర్యటించి రైతులకు పశువుల బీమా పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఆవు మరియు పశువుల యజమానులు అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు అందిస్తున్న బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంపూర్ణ పశుదాన్ కవాచ్ స్కీమ్ కింద 5 సంవత్సరాలు దాటిన ఆవు మరియు పశువు కు ఈ బీమా వర్తిస్తుందని, ఇందుకోసం ఒక సంవత్సరం ప్రీమియానికి 5 శాతం, రెండు సంవత్సరాలకు అయితే 8 శాతం, మూడు సంవత్సరాలు అయితే 11.75 భీమా చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీమా చేయించుకునే రైతులు పశువుల హెల్త్ సర్టిఫికెట్, రైతు ఆధార్ కార్డు బ్యాంకు పాస్ పుస్తకం, నామిని ఆధార్ కార్డు అందించాలని వివరాలకు 7013783124 నెంబర్ ను సంప్రదించాలన్నారు . పాలసీ చేసిన 15 రోజుల తర్వాత ఈ బీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు బీరం జయ సుబ్బారెడ్డి, బొంతా గోపాల్ రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరాముని కళ్యాణోత్సవం

**పెండ్లిమర్రి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండలంలోని పెండ్లిమర్రిలో ఆదివారం శ్రీరాముని కళ్యాణోత్సవం నిర్వహించారు. 12వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీరాముని ఉత్సవం నిర్వహించి ఆలయ ఆవరణంలో కోలాటాలు, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు

**సిద్దవటం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
సిద్దవటం మండలం లింగంపల్లి కడపాయ పల్లెకు గ్రామాలకు చెందిన కోదండ రామాలయాన్ని ప్రారంభించడానికి ఆదివారం ఎండోమెంట్ శాఖ అధికారులు గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో ఆలయ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని గ్రామ పెద్దలు అందరూ సహకరించాలని ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, కడప డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శివయ్య, రాజంపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ స్థానిక పోలీసులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సుధీర్ ఏకగ్రీవం

**సిద్దవటం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సుధీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ ఎన్జీవో హోం నందు వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సిద్దవటం నివాసి అయిన ఎం.సుధీర్‌కుమార్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను వ్యవసాయ విస్తరణాధికారుల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ఎన్జీవో రాష్ట్ర సెక్రటరీ విద్యాసాగర్ పాల్గొన్నారు.



## విద్యార్థులు ఇష్టపడి చదవాలి



**బద్వేలు, ఫిబ్రవరి 9, ప్రభాత వార్త**
విద్యార్థులు కష్టపడే కాకుండా ఇష్టపడే చదివినప్పుడే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలరని కడప డివిజన్ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ బాలుర వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ మరియు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్షలలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఎప్పుడు పాజిటివ్‌గా ఆలోచించాలని ,పరీక్షలపై ఒత్తిళ్లు తగ్గించుకోవాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థులు తమ విద్యను అభ్యసించాలని తదితర సూచనలు ఇచ్చారు .అలాగే పరీక్షలు దగ్గర పడుతున్న విద్యార్థులకు ఒత్తిడికి గురవుతుంటారని అలా గురికాకుండా మంచి ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ఏ రోజు చదివిన అంశాన్ని ఆరోజు మరలా రివిజన్ చేసుకుంటే పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కాకుండా ఈజీగా సమాధానం రాయవచ్చు అన్నారు. అలాగే విద్యార్థులు తమ ఆరోగ్యం పై కూడా దృష్టి పెట్టాలని ఒక ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించగలరని తెలిపారు. సమాధానాలను రాసేటప్పుడు పెద్ద పేరాగ్రాఫ్ లు గా కాకుండా పాయింట్లు రూపంలో రాసినట్లయితే మార్కులు బాగా వస్తాయని సూచించారు. ప్రశ్నలను అడిగిన విధానాన్ని బట్టి మీ సమాధానం ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, నరసింహులు, రత్నం, వసతి గృహం సంక్షేమ అధికారి నాగదాసరి ప్రసాద్ మరియు వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## చింతకొమ్మదిన్నె మండల అధ్యక్షుడు ఎన్నిక

**కడప, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**
ఈ కార్యక్రమం చింతకొమ్మదిన్నె మండల కేంద్రంగా జరిగింది. గోపాలపురం గ్రామానికి చెందిని గజ్జల వెంకట సుబ్బారెడ్డి గారిని మండల అధ్యక్షులుగా వీ ప్రశాంతి సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షులుగా వ్యవహారించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మి నారాయణ రెడ్డి ఉపాధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, కడప అసెంబ్లీ ఇంచార్జి బైరెడ్డి మధుసూదన్ రెడ్డి కమలాపురం అసెంబ్లీ కన్వీనర్ చంద్రమోహన్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ప్రభు, బీజేవైఎం బత్తల పవన్, బీజేవైఎం ఉపాధ్యక్షులు ప్రవీణ్, చింతకొమ్మదిన్నె బీజేపీ యువత, సీనియర్ నాయకులు, మరియు కార్యకర్తలు పాల్గొనటం జరిగింది.

## రోడ్డు ప్రమాదంలో లారీ-బస్సు ఢీ

**సిద్దవటం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
కడప - చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లి కామాక్షమ్మ గుడి సమీపాన రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక పోలీసులు చెప్పిన కథనం ప్రకారం ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి కడప డిపోకు చెందిన ఆర్టీసీ నాన్ స్టాఫ్ బస్సు కడపకు వెళ్తున్న సమయంలో కడప నుంచి తిరుపతి వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి బస్సును ఢీకొన్నాడు. బస్సు డ్రైవర్ డీవీడీ రెడ్డి మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలు తగలడంతో హైవే పెట్రోలింగ్ సిబ్బంది 108 వాహనంలో మెరుగైన వైద్య సేవలు కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలానికి ఇన్‌ఛార్జి మండల ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో విచారిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై బాబయ్య, రైటర్ కొండయ్య, స్థానిక పోలీసులు పాల్గొని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేశారు.



## కడపలో బిజెపి నాయకుల సంబరాలు



**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో 27 సంవత్సరాల తరువాత బిజెపి ఘన విజయం సాధించిందని కడప జిల్లా బిజెపి అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర నాయకులు సింగారెడ్డి రామచంద్రారెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలన చూసి, ఢిల్లీ వాసులు బిజెపికి పట్టం కట్టారని తెలిపారు. కడప ఎన్జీవో కాలనీలోని వాజ్ పై కూడలిలో బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చారు. వై జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మి నారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, బీరం సుబ్బారెడ్డి, కడప అసెంబ్లీ కన్వీనర్ మధు సుధన్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు పవన్ కుమార్, చలపతి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు సురేంద్ర, అశోక్ కుమార్ రెడ్డి ,మునగ సతీష్, హరి నారాయణ, లక్ష్మణ్ రావు, ఓబులేసు, నాగిరెడ్డి, సురేష్, కవిత కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన ఈగ వెంకటరమణారెడ్డి



**బద్వేలు, ఫిబ్రవరి 9 , ప్రభాతవార్త :**
ఇన్‌చార్జి మంత్రి సవిత ను ఆదివారం బద్వేలు ఎల్ఎస్‌పీ డ్యాం ఛైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కొన్ని సమస్యలు విన్నవించారు. ఈ మద్యకాలంలో ఎల్ఎస్‌పీ డ్యాం విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయని, వాటిని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. రైతులకు మేలు జరిగేలా, సకాలంలో పంటలకు నీరుచేరేలా డ్యాం ద్వారా కాలువల మరమ్మతులు చేపట్టి ప్రతి ఎకరానికి నీరు అందించేందుకు కృషిచేస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఎల్ఎస్‌పీ డ్యాము నుంచి పంటలకు నీరు చేరే విషయంలో అన్ని అడ్డంకులు ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేక నిదులు కేటాయిస్తే వాటి ద్వారా చెరువుల అభివృద్ధికి పాటుపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నాయకులు రితేష్‌రెడ్డిలతో కలిసి ఇన్‌చార్జి మంత్రి సవిత, మంత్రి ఫరూఖ్‌లను కలిశారు.



వాసవి మాత ముందు కొలువుతీరిన ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గం

## అవోపా ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ



**బద్వేల్ అర్బన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**
బద్వేలు అవోపా వారి ఆధ్వర్యంలో ఆదివారం పెన్షన్ కార్యక్రమము , ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉచిత హోమియో క్యాంపును ఏర్పాటు చేయుట జరిగింది. ఈ కార్యక్రమంలో బద్వేలు అవోపా అధ్యక్షులు నూకల రెడ్డయ్య, ప్రధాన కార్యదర్శి సి.వి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొని జేటి సుబ్బారావు, సభ్యులు శ్రీరాములు, గౌరవ సలహాదారులు పైడిమర్రి సుబ్రహ్మణ్యం మహిళా మండలి సభ్యులు శధనలక్ష్మి, మరియు పెన్షన్ దారులు ఆర్యవైశ్య ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయడం జరిగింది. పెన్షన్ దారులకు అల్పాహార విందును చప్పరపు సుబ్బారావు, కుటుంబ సభ్యులు మరియు సి వి. నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయుట జరిగింది. అలాగే అమ్మవారికి ముత్యాల చీరకు గాను ఐదువేల రూపాయలు ఇచ్చి సహకరించిన సి వి. నాగేశ్వరరావును అవోపా అధ్యక్షులు నూకల రెడ్డయ్య అభినందిస్తూ సత్కరించడం జరిగింది.

## గ్రామాల్లో చిరుధాన్య విప్లవం

**చేయి చేయి కలిపితే చేతకానిది ఏముంటుంది? వీళ్లదీ అదేమాట. ఐదువేల మంది మహిళలు కాయగూరలు పండించి నగరాలకు ఎగుమతి చేశారు. ఫర్నిచర్ తయారుచేసి పట్టణాలకు పంపించారు. తాజాగా చిరుధాన్యాలని సామాన్యులకు చేరవచేస్తూ ఆరోగ్యానికి పట్టం కడుతున్నారు.** జనగామ జిల్లాలోని కాకతీయ మహిళా సహకార సంఘం ఏం చేసినా అది తోటివారికి స్ఫూర్తినిస్తూనే ఉంది. కొవిడ్ తరవాత స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలోని పల్లెల్లో ఒక కార్పొరేట్ సంస్థ సర్వే నిర్వహించింది, ఆశ్యర్యంగా ఒక్క తాటికొండ గ్రామంలోనే 600 బిపి, షుగర్ వ్యాధిగ్రస్థులున్నట్టు ఆ సర్వేలో తేలింది. ఈ విషయం తెలుసుకున్న కాకతీయ మహిళా సహకార సంఘం సభ్యులు.. అనారోగ్యం నుంచి కోలుకోవడానికి చికిత్సతో పాటు చిరుధాన్యాలతో స్వీట్లతో సహ అన్ని రకాల వంటలూ చేసు కోవచ్చని ముందుగా తమ సంఘ సభ్యులకే అవగాహన కల్పించారు. ఆ తరవాత నుంచీ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటిచోట్ల సేంద్రియ పద్ధతుల్లో పండించిన జొన్నలు, రాగులు, సజ్జలను నెలకోసారి లారీల్లో ఘన్‌పూర్ తెప్పించుకుంటున్నారు. సొంతంగా గిర్నీలు, మరమిల్లులు ఏర్పాటు చేసుకుని చిరుధాన్యాలని మర పట్టిస్తున్నారు. గ్రామాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసి బయటకన్నా పది రూపాయలు తక్కువకే పిండి, రవ్వ అమ్ముతు న్నారు. ప్రస్తుతం వీరు 75 గ్రామాల్లో ప్రతి నెలా జొన్న, రాగి, సజ్జ పండి, రవ్వలతోపాటు గోధుమలను విక్రయిస్తూ ఆరోగ్యానికి పట్టం కడుతున్నారు. ఇంతకీ వీళ్ల ప్రయాణం ఎలా ప్రారంభమైందంటే 22 ఏళ్ల నక్రితం గ్రామీణ మహిళల శక్తిని ప్రపంచానికి చాటేందు వెంకటస్వామి స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో 12 మంది సభ్యులతో కాకతీయ మహిళా మాక్స్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. వీరంతా నెలకు రూ.పది నుంచి రూ.50 వరకు పొదుపు చేస్తూ ఆర్థికంగా బలపడ్డారు. క్రమంగా వీళ్ల పొదుపు కోట్ల రూపాయలకు చేరుకుంది. అలా అలా ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తి పొందుతూ 75 ఊళ్లలో 5200 మంది సభ్యులు ఈ సంఘంలో చేరారు. పొదుపు సొమ్ముతో మొదట వీళ్లు ఒక సూపర్ మార్కెట్ ప్రారంభించారు.

# పెండింగ్ ఫైల్ పరిష్కారమే మా ధ్యేయం

## తహసిల్దార్ భీమేశ్వరరావు డిప్యూటీ తహసిల్దార్ రెడ్డప్పరెడ్డి





**పీలేరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
మండల పరిధిలో వివిధ రకాల సమస్యలపై రెవెన్యూ సదస్సులలో ప్రభుత్వానికి అర్జీల రూపంలో ప్రజలు విన్నవించుకున్న పెండింగ్ ఫైళ్లను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని పరిష్కరించడమే మా లక్ష్యం అని పీలేరు మండల తహసిల్దారు డిప్యూటీ తాసిల్దార్ రెడ్డప్పరెడ్డి అన్నారు. ప్రతిరోజు మండల పరిధిలో రెవెన్యూ సమస్యల మీద అత్యధిక మంది అర్జీల రూపంలో ఇస్తున్నారని వాటిని పరిష్కరించి ప్రజా సమస్యలను తీర్చటమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. అదేవిధంగా రెవెన్యూ రికార్డులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పరిశీలించాలని వాటిని క్రమ పద్ధతిలో రికార్డు రూములో భద్రపరిచేందుకు దశలవారీగా వీఆర్ఏల సహాయం తీసుకునేందుకు కూడా వెనుకాడబోమన్నారు. గత ఆరు ఏడు రోజులుగా రికార్డు రూమును పరిశీలించి రికార్డు పద్ధతులను భద్రతను పద్ధతి ప్రకారం ఉంచేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ తహసిల్దార్ అన్నారు. అక్రమదారుల ఆట కట్టించడానికి రికార్డులను భద్రపరుస్తారున్నామని తాసిల్దార్ భీమేశ్వరరావు, డిప్యూటీ తహసిల్దార్ రెడ్డప్పరెడ్డి మండల పరిధిలో అనేక సంవత్సరాలుగా సమస్యలతో సతమతమవుతూ గత ప్రభుత్వంలో అవినీతి జరిగినట్లు ఉన్నత అధికారులకు స్థానిక శాసనసభ్యులకు ఫిర్యాదులు అందడంతో వాటిని పరిశీలించి అక్రమ దారుల ఆట కట్టించడానికి రికార్డు రూములో రికార్డులను పరిశీలించి అక్రమార్కుల భరతం పట్టేందుకు కృషి చేస్తూ ఉన్నత అధికారులకు ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయడంలో ముందుంటామని తాసిల్దార్ భీమేశ్వరరావు డిప్యూటీ తాసిల్దార్ రెడ్డిప్ప రెడ్డిలు ఉద్ఘాటించారు. వీఆర్వోల వీఆర్ఏల సహకారం తీసుకొని ప్రతిరోజు కార్యాలయాలకు వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేసి ఆ గ్రామ వీఆర్వోలకు అందజేసి వాటిని పరిష్కరించేందుకు ఆదేశాలు కూడా జారీ చేస్తున్నామని వారు తెలిపారు. ఏది ఏమైనప్పటికీ గత ఆరేడు సంవత్సరాలుగా ఫిర్యాదుల అందిన ఫిర్యాదులను పరిశీలించి న్యాయబద్ధంగా ఉన్న రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వారం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో పదుల సంఖ్యలో సమస్యలపై పీలేరు రెవెన్యూ కార్యాలయంలో రాయచోటి జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో ఫిర్యాదులు చేసిన వాటిని పరిశీలించి ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నామని వారు కార్యాలయ సిబ్బంది సైతం అవినీతికి తావు లేకుండా పనిచేయాలని తహసిల్దార్ డిప్యూటీ తాసిల్దారులు కోరారు.

## చైతన్య సేవా సంస్థకు బియ్యం వితరణ



**మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థకు ఏబిసి పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అప్పినిపల్లి భాస్కరాచారి 200కిలోల బియ్యాన్ని వితరణ చేశారు. ఆదివారం చైతన్య సేవాసంస్థను సందర్శించి ఆయన బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సేవాసంస్థలో వృద్ధులు, పిల్లలకు చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ యాజమాన్యం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఆయనకు చైతన్యస్వచ్ఛంద సేవాసంస్థ యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపి.ఆనందన్, జనరల్ సెక్రటరీ కవితారాణి, కోశాధికారి పట్నం గిరిజంమాల్, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

## మధ్య తరగతి సీనియర్ సిటిజన్లకు ఊరట

### అసోసియేషన్ అధ్యక్షులు మునిగోపాల్‌క్రిష్ణ



**మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్స్‌కు ఊరట లభించిందని రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వేల్పేర్ అసోసియేషన్ అధ్యక్షులు మునిగోపాలక్రిష్ణ తెలిపారు. ఆదివారం జిఆర్‌టిస్కూల్‌లో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి సీనియర్ సిటిజన్స్‌కు ఆదాయపరిమితిని రూ.12లక్షలకు పెంచడం వల్ల 90శాతం మంది విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగులకు ఓ వరం అయ్యిందన్నారు. 70సంవత్సరాలు నిండిన వయోవృద్ధులకు ఆయుస్మాన్ యోజనా పథకం కూడా ఓ వరం అన్నారు. రూ.5లక్షల వరకు ఫైర్‌హెల్త్ ఇన్సూరెన్స్ ఉచితంగా కల్పించడం పట్ల సీనియర్ సిటిజన్స్ అందరూ అభినందనలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ యుస్మాన్ సాహెబ్, ఆర్గనైజర్ క్రిష్ణమూర్తి, సలహాదారుడు ప్రొపెసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డంతా సెంట్రింగ్ కొయ్యలు - ఇబ్బందుల్లో ప్రజలు

### పట్టించుకోని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు

**మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**



బహుళ అంతస్తు భవన నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డంతా సెంట్రింగ్ కొయ్యలు నెలల తరబడి ఉంచడం వల్ల ఆ మార్గాన వెళ్ళే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల బహుళ అంతస్తు యజమానులు రోడ్డంతా ఆక్రమించుకొన్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని రింగురోడ్డు నుంచి అనపగుట్ట బైపాస్‌కు వెళ్ళే మార్గంలో గత రెండేళ్ళ క్రితం సిసిరోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ మార్గంలో బహుళ అంతస్తు నిర్మాణం పనులు జరుగుతున్నందువల్ల ఇరుకుగా ఉన్న సిసిరోడ్డు మార్గంలో సెంట్రింగ్‌కొయ్యలే రోడ్డంతా ఆక్రమించుకొన్నాయి. ఈ మార్గంలో వెళ్ళాలంటే ద్విచక్రవాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ సమీపంలోనే ఇంత బహుళ అంతస్తు నిర్మాణ పనులు జరుగుతున్నా, రోడ్డంతా సెంట్రింగ్ కొయ్యలు నెలల తరబడి వేసినా ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల పలు విమర్శలకు తావిస్తోంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో అనధికారికంగా అనేక భవన నిర్మాణాలు జరుగుతన్నా మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు కనీసం పట్టించుకోకపోవడం కూడా విమర్శలకు చోటు చేసుకొంటోంది. మున్సిపల్ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మృతదేహాలు బంధువులకు అప్పగింత

### శోకసంద్రంలో కుమ్మరపల్లె

**మదనపల్లి క్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.**



లారీ ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మదనపల్లె ప్రశాంత్‌నగర్‌కు చెందిన తండ్రి బిడ్డలు శనివారం మొలకలచెరువులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సోమశేఖర్ (35), కుమారుడు రెడ్డిశేఖర్ (5), కుమార్తె సిద్దేశ్వరి (3) లు మృతి చెందగా, సోమశేఖర్ భార్య కవిత గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. మృతదేహాలకు మదనపల్లి జిల్లా ఆసుపత్రి లో శవపరీక్షలు పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బి.కొత్తకోట మండలం ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ సమీపంలోని కుమ్మరపల్లిలో అంత్యక్రియలను పూర్తి చేశారు. దీంతో కుమ్మరి పల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎంఆర్‌పిఎస్ కలికిరి మండలం ఇన్చార్జిగా ఆంజనేయులు



**పీలేరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త;**
ఎంఆర్‌పిఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్ పి, నూతన గ్రామ కమిటీని కలికిరి మండలం, పత్తెగడ గ్రామం తిమ్మారెడ్డిగారి మాదిగపల్లిలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నూతన గ్రామ కమిటీని కలికిరి మండల సీనియర్ నాయకులు మంద గురుప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కృష్ణయ్య సమక్షంలో కమిటీ వేయడం జిగిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ, కమిటీ నిర్వహణ పర్యవేక్షకులుగా ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ మాదిగ, కో ఇన్చార్జులు ముల్లంగి రెడ్డప్ప అమరాల వెంకటరమణ మరియు మండల ఇన్చార్జిలు నాయకులు విచ్చేశారు. గ్రామ కమిటీ కలికిరి మండల ఇంచార్జ్ మరియు తిమ్మారెడ్డి గారి పల్లి గ్రామ అధ్యక్షుడు మంద ఆంజనేయులు, ఉపాధ్యక్షులు జల్లా పవన్ కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శి: మంద మహేష్ మాదిగ ప్రచార కార్యదర్శి మంద నరేష్ మాదిగ కోశాధికారి మంద శ్రీనివాసులు మాదిగ కార్యదర్శి జిల్లా జయకుమార్ మాదిగ సహాయ కార్యదర్శి వడ్డేపల్లి భరత్ కుమార్ కార్యవర్గ సభ్యులు మంద సుధాకర్ మాదిగ, వరగాని నరేష్ మాదిగ, తేజ మాదిగ, జల్లా వినోద్ కుమార్ మాదిగ, మంద సుబ్రహ్మణ్యం మాదిగ పై నున్న గ్రామ కమిటీ సభ్యులుగాఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణ లక్ష్యసాధనలో భాగంగా మహాజన నేత మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఉద్యమ నిబంధన ల మేరకే నూతన కమిటీలు పనిచేయాలని అదేవిధంగా కలికిరి మండలంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నూతన నాయకత్వాన్ని కమిటీ లని బలోపేతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు సంగీతం రవిశ్వరయ్య, వాల్మీకిపురం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గంత బాలకృష్ణ, కలికిరి మండలం ఎంఎస్‌పి నాయకులు రెడ్డప్ప, దప్పు కళాకారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



**కమలాపురం ఫిబ్రవరి 09 ప్రభాత వార్త**
రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె బాబు మాదిగ తెలిపారు ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంఈఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహా మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎంఈఎఫ్ జాతీయ రాష్ట్ర కమిటీల ఆదేశాల మేరకు కమలాపురం నియోజకవర్గ ఎంఈఎఫ్ నూతన కమిటీ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు తెలంగాణలో ఎస్సీ వర్గ వర్గీకరణ చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ పై ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజాన్ మిశ్రా నివేదికను త్వరితగతిన తెప్పించుకొని ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక: ఎంఈఎఫ్ గౌరవాధ్యక్షులుగా ఆర్. గాంగేయుడు, ముఖ్య సలహాదారులుగా కె రామాంజనేయులు, అధ్యక్షులుగా దాసరి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా సి వెంకటేష్, సి. చేంద్రాయుడు,ప్రధాన కార్యదర్శిగా సి. ఓబులేసు, సహాయ కార్యదర్శులుగా జె. బాల ఓబయ్య, బి. వెంకట రమణ, కోశాధికారిగా యన్. వెంకట వరప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ఎస్ గంగాధర్, ఎం.సి. శివ, పి. మనోహర్, పి. సునీత, ఆర్. నాగసింహ, చంద్ర తదితరులను ఏకగ్రీవంగా ఎన్ను కున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లగాల్ల వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి భాస్కరరావు, ఎమ్మార్పీఎస్ మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భైరవగుట్ట దగ్గర వాహనాలు తనిఖీ

**సుండుపల్లె, ఫిబ్రవరి09, ప్రభాతవార్త:**
ఆదివారం సాయంత్రం భైరవగుట్ట దగ్గర వాహనాలను తనిఖీ చేపట్టి వాహనదారులు నియమ, నిబంధనలను పాటించాలని లేనిపక్షంలో జరిమానాలు, శిక్షలకు గురి కావాల్సి వస్తుందని సుండుపల్లె ఎస్సై ముత్యాల శ్రీనివాసులు తెలియజేశారు. రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు వాహన రికార్డులను తప్పనిసరిగా వాహనాలలో ఉంచుకోవాలని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, నేరమని ఆయన తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వీహెచ్‌పీ మండల నూతన కార్యవర్గం ఎంపిక

### - మండల అధ్యక్షుడుగా బుక్కపట్నం హరి



**గాలివీడు, ఫిబ్రవరి 9(ప్రభాతవార్త):**
విశ్వహిందూ పరిషత్ మండల నూతన కార్యవర్గం ఎంపిక అన్నమయ్య జిల్లా వీహెచ్‌పీ సహాయ కార్యదర్శి వైఎన్ జయసింహ ఆధ్వర్యంలో జరిగింది. ఆదివారం మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల అధ్యక్షుడుగా బుక్కపట్నం హరి, ఉపాధ్యక్షులుగా ఎన్.ఇరగంరెడ్డి, కార్యదర్శిగా పి.నాగభూషణం, కోశాధికారిగా కె.పెంచలయ్య, గోరక్షక్ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి బాలయోగి, భజరంగ్‌దళ్ సభ్యులుగా సి.భాస్కర్, కిరణ్‌కుమార్, పి.జగన్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సనాతన హైందవ పరంపరను దశదశలా విస్తరించేందుకు ప్రతి హిందువునూ సంఘటితం చేసి ధర్మరక్షణకు బద్ధులను చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ధర్మ చర్ సంపర్క్ ప్రముఖ్ ఇ.మణికంట, జిల్లా ధర్మప్రచార ప్రముఖ్ నాగరాజు, గోరక్షక్ ప్రముఖ్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## 12న ఒంటిమిట్టలో మాతంగ మహర్షి, రవి దాస్‌లా జయంతి వేడుకలు



**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**
ఏకశిలా నగరం ఒంటిమిట్టలోని జాంబవంతుని 50 అడుగుల విగ్రహ ప్రాంగణంలో శ్రీ మాతంగ మహర్షి శ్రీ సంత్ రవిదాస్ లా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ వెల్లడించారు ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒంటిమిట్టలో శ్రీరామ చంద్రుని విగ్రహ ప్రతిష్టాపన చేసిన జాంబవంతుల విగ్రహాన్ని ఒంటిమిట్ట చెరువులో 108 అడుగులతో ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తరతరాలుగా అగ్రవర్ణాల చేతిలో అణగదుకుతున్న మాదిగ కులస్తుల చరిత్ర ప్రజలకు స్పష్టం చేయడానికి ఈ జయంతి వేడుకలను అట్టహాసంగా జరుపుకొనుచున్నామని తెలిపారు. మాదిగ కుల గురువు శ్రీ మాతంగి మహర్షి చరిత్ర అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ప్రస్తుత సమాజంలో మాదిగల ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు మాతంగా మహర్షిని రవిదాస్ లను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జయంతి వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా అలాగే జిల్లా వ్యాప్తంగా మాదిగలు తరలివచ్చి మాదిగ కుల ఉన్నత్యాన్ని ప్రజలకు చాటింగ్ చెప్పేలా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు ఈ సమావేశంలో ఆది జాంబవ ధర్మ రక్షణ సమితి అధ్యక్షులు ఏ నాగభూషణం మాదిగ ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి బాల లక్ష్మయ్య మాదిగ మండల అధ్యక్షులు చాపాటి మనోహర్ ఉపాధ్యక్షులు బాల నరసింహా మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలన అవగాహన ర్యాలీ



**ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
సర్వోదయ ఇంటి గ్రేటెడ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా స్థానిక వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం నందు ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యాధికారి నల్లబల్లి హిమబిందు మాట్లాడుతూ పదవ తేదీ జరగబోయే జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం లో పట్టణంలో 119 సంవత్సరముల పిల్లలకు తమ సమీప అంగన్వాడీ సెంటర్స్, స్కూల్స్, జూనియర్ కాలేజీలు మరియు ఆరోగ్య కేంద్రాలలో ఆల్బండజోల్ మాత్రలువేస్తారని కావున ప్రతి తల్లి తండ్రులు తమ పిల్లలకు తప్పక మింగించితద్వారా రక్తహీనత నుండి బయట పడవచ్చు అన్నారు. అలాగే ఈ మాత్రవల్ల కలిగె ప్రయోజనాలను అవగాహన కల్పించారు. అనంతరం పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సిర్డ్ సొసైటీ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరీలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్ఏఎల్‌సి స్త్రీల మహా సమాజం



**రైల్వే కోడూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.**
తిరుపతి జిల్లాలోని నాయుడుపేటలో గత మూడు రోజులుగా ఎస్ ఏ ఎల్ సి 82వ స్త్రీల మహా సమాజం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు ఎస్ ఏ ఎల్ సి చర్చికి చెందిన 20 మంది మహిళలు కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాల్గొని జ్ఞానము కలిగిన నోరు తెరిచెను కృపగల ఉపదేశం చేయను అనే మూల వాక్యంతో నాయుడుపేట నందు దైవ సందేశాన్ని మహిళలు జ్ఞానంతో విని ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతంగా మూడు రోజులు పూర్తిచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు మేరీ గ్లోరియా శ్రీమతి శాంతమ్మ థామస్, ఫాస్టర్ అమ్మ టి మంజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాలెం మేరీ, రాణి సంయుక్త, కళ్యాణి, సుకేశిని, పి జ్యోతి, వినోలియా, ఎమ్మీలీయమ్మ, రచన, సంపూర్ణమ్మ,మరి కొందరు మహిళలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వీసికే అధ్యక్షులుగా రెడ్డిప్రసాద్

**మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**



వీసికె, బాస్ సంయుక్తంగా ఆదివారం పట్టణ కమిటీ ఎన్నిక జరిగింది. బాస్ జిల్లా కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్ అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. వీసికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికైన వారిని అభినందించారు. వీసికే అధ్యక్షునిగా రెడ్డి ప్రసాద్, బాస్ అధ్యక్షునిగా ఇర్ఫాన్‌ను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికన కమిటీ సభ్యులు వీసికే, భారతీయ అంబేద్కర్ సేనను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుగట్లు రమణి, చాట్ల బయన్న, ముత్యాలమోహన్, జనార్ధన్, గంగాధర్, రమణ, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నులిపురుగు మాత్రలు పంపిణి

**సుండుపల్లి, ఫిబ్రవరి 09,ప్రభాతవార్త:**
రాయవరంలోని అన్ని అంగన్వాడీ సెంటర్స్‌లో మరియు స్కూల్స్‌లో పిల్లలకు నులిపురుగు మాత్రలు మింగిస్తామని డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలియజేసారు. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సి పరిధిలోని 51 అంగన్వాడీ సెంటర్స్ మరియు 36 స్కూల్స్ మొత్తం 2714 మంది పిల్లలకు భోజనం చేసిన తరువాత మాత్రలు మింగిస్తామన్నారు. మాత్రలు మింగడంతో పాటు క్రింది విధంగా కొన్ని జాగ్రత్తలు పాటించడం వలన నులిపురుగులు నివారించవచ్చన్నారు. 1 గోర్లు కత్తిరించుకోవడం 2. కూరగాయలు వండేటప్పుడు శుభ్రంగా కడుగు కోవడం 3.పరిసరాలు పరిశుభ్రంగాఉంచుకోవడం 4.బహిరంగా ప్రదేశాలలో మలవిసర్జన చేయకూడదు. 5.తినే ముందుతిన్న తరువాత చేతులు శుభ్రపరుచుకోడం 6.మరుగుదొడ్డి వాడిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రపరుచుకోవాలన్నారు.

## ముగ్గురాయి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
వేముల మండలం వేల్పులలో టిఫిన్ బైరైటీస్‌కు చెందిన మైనింగ్ భూమిలో సుమారు రూ. 200 కోట్ల విలువైన ముగ్గురాయి అక్రమంగా తొవ్వుతున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. ఆదివారం కడప బిజెపి కార్యాలయంలో పాత్రకేయులతో సుబ్బారెడ్డి మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న వేల్పులలో టిఫిన్ బైరైటీస్‌లో 2వేల టన్నుల మైనింగ్ అనుమతి లేకుండానే వైసిపి నేతలు అక్రమంగా తరలించారని ఆరోపించారు. దేశ సహజ సంపద అయిన ముగ్గురాయి అక్రమంగా తవ్వుతూ ప్రభుత్వానికి ఎటువంటి పెనాల్టీలు చెల్లించకుండానే కోట్లు రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, జిల్లా మైనింగ్ అధికారులను కోరారు. లేని యెడల కూటమి నాయకులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి ఉపాధ్యక్షులు బీరం సుబ్బారెడ్డి, బీజేవైఎం నాయకులు పవన్ కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, ప్రధాన కార్యదర్శిలు సురేంద్ర, అశోక్ కుమార్, ప్రవీణ్ నాయుడు, ఓబిసి జిల్లా అధ్యక్షులు ప్రభు కుమార్, నాయకులు అమర్నాథ్ రెడ్డి, మండల అధ్యక్షులు నాగిరెడ్డి, కిరణ్, పాల్గొన్నారు.

## పందుల యజమానులపై చర్యలు తీసుకోవాలి



**మైదుకూరు, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**
మున్సిపాలిటీ పరిధిలో పందుల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు. గతంలో పందుల యజమానులపై చర్యలు తీసుకోవడంతో చాలావరకు పట్టణంలో కనిపించకుండా ఉండేవని ఈ మధ్యకాలంలో మున్సిపాలిటీ కమిషనర్ చర్యలు తీసుకోకపోవడంతో పందులు వీధులలో ఎక్కువగా తిరుగుతూ ఉండడంతో పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పందుల యజమానులపై చర్యలు తీసుకోకపోతే పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతూ ఇళ్లల్లోకి చొరబడేలా ఉన్నాయని ఒంటరిగా చిన్నపిల్లలు వీధుల్లో తిరుగుతూ ఉంటే వారిపై దాడి చేసేలా ఉన్నాయని ఇప్పటికైనా మున్సిపాలిటీ కమిషనర్ సీరియస్ గా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజల వేడుకుంటున్నారు.

## సైబర్ క్రైమ్స్ పై అవగాహన



**పీలేరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
సర్పంచ్ డాక్టర్ హబీబ్ భాషా హైదరాబాదులో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రామ్‌లో రెండవ రోజు పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అంబర్పేటలోని మెడికల్ పోలీస్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో జరిగిన సైబర్ క్రైమ్ అవగాహన సమావేశంలో ఆయన ప్రసంగం అందరిని ఆకట్టుకునే విధంగా ఆకర్షణీయంగా అవగాహన కల్పించే విధంగా ఉందని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ హబీబ్ భాషా మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అరాచకాలు అనైతిక కార్యక్రమాలు బెదిరింపులు మోసపూరితమైన చిట్ చాట్ బ్యాంక్ అకౌంట్లో క్రైమ్ దోపిడీ, మానభంగాలు, పసిపిల్లల కు రక్షణ కరువవ్వుటముతో పోలీసులు నిర్వహించిన వారి బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్మును సైతం దోపిడీ చేసి ఆత్మహత్యలకు ప్రేరేపిస్తుండటం చూస్తే ఎంతో బాధాకరమని ఆయన ప్రసంగంలో తెలియజేశారు. ఆయన ప్రసంగాన్ని విన్న పలువురు ఉన్నత అధికారులు డాక్టర్లు, ఐపీఎస్ ఆఫీసర్లతో పాటు పలువురు ఆయన ప్రసంగానికి ముద్దులైనట్లు ఆయన తెలిపారు.

## ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

**చిన్నమండెం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
మండలంలోని దేవగుడిపల్లి గ్రామం కొండములకు చెందిన పసల రామాంజులు, సుజాతల కుమారుడు పసల సన్నీ అనేయువకుడు గురువారం రాత్రి రాయచోటి మదనపల్లి ప్రధాన రహదారిలో దేవగుడిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనంలో చిన్నమండెం నుండి రాయచోటి వైపు వెళుతూ ప్రామాదవశాత్తు జారి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడిన సంఘటన పాఠకులకు విదితమే. అతను తిరుపతిలో చికిస్త పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతని మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకొన్నాయి.

## వ్యక్తిపై అత్యాయత్నం

**కలకడ, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
తగాదాలతో వ్యక్తిపై అత్యాయత్నం చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీస్ ఇచ్చిన సమాచార మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ గొల్లపల్లి కు చెందిన సుధాకర్ ఈనెల ఏడవ తేదీన మూత్ర విసర్జనకు వెళ్లే వస్తున్న సమయంలో, అదే గ్రామానికి చెందిన వేమ నారాయణ తాను తీసుకొచ్చిన పెట్రోలను సుధాకర్ పై పోసి నిప్పు అంటించినట్లు తెలిపారు.వీరికి గతంలో భూతగాదాలు ఉన్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో సుధాకర్ పై వేమ నారాయణ పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు తెలిపారు. సుధాకర్ కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి అతని కాపాడి ప్రైవేట్ వాహనంలో పీలేరు తరలించి, అక్కడ నుండి తిరుపతి రుయా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి పట్టణంలోని నారాయణాద్రి వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రుతుక్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలి

**మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
విద్యార్థినులు రుతుక్రమంలో ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి శానిటరి పాడ్స్ వాడాలి అనే అంశంపై ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ నిర్వహించి విద్యార్థులకు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహ నిర్వహించారు. ఈ అంశాలపట్ల మిస్టర్ ఎం.అనంత్, మిస్టర్స్ జయశ్రీ అనంత్, సోషల్ ఎంటర్ప్రినర్స్ ప్రమ్ ఫెమినైస్ సోషల్ ఆర్గనైజేషన్, మహిళా ప్యాకల్టి, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ కె.సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారులకు

# తమ వంతు పూర్తి సహాయ సహకారాలు

రాయచోటి పట్టణం జిల్లా కేంద్రంగా ఉంటుంది

పట్టణంలో నూతన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు

గతంలో రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

నియోజకవర్గంలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని గునుకుంట్ల రోడ్డు నందు నియోజకవర్గంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని వ్యాపారాలకు ఎటువంటి సమస్యలున్న వెంటనే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్తగా వెంచర్లు వేసే వారు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రోడ్లు, మరియు అన్ని మౌలిక వసతులు తప్పక ఉండేటట్లు చూడాలన్నారు. రాయచోటి పట్టణం ఎప్పటికీ జిల్లా కేంద్రంగానే ఉంటుందని జిల్లా కేంద్రం మార్చడానికి ఎవరివల్ల కాదన్నారు. రాయచోటి జిల్లా కేంద్రాన్ని మారుస్తారనే వార్తలను ఎవరు నమ్మరాదన్నారు. తమ ఒంట్లో ప్రాణం ఉన్నంతవరకు రాయచోటి జిల్లా కేంద్రాన్ని మార్చనివ్వనన్నారు. రాయచోటిలో అందరికీ అనుకూలమైన ప్రాంతంలో నూతన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

# అవయవదాన అవగాహన కార్యక్రమం విజయవంతం





**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరులో కొవ్వూరు గ్రాండ్ అధినేత కొవ్వూరు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అవయవదాన అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే,3కే, 1.5కే రన్‌కు విశేష లభించింది. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని రైల్వేబ్రిడ్జ్ దగ్గర నుండి అవయవదానంపై అవగాహన కోసం నిర్వహించిన 5కె, 3కె, 1.5 కెరన్‌ను ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సిఏ సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వుందన్నారు. రన్ ఫర్ లైఫ్ నినాదంతో కొవ్వూరు రమేశ్ రెడ్డి పరుగు పందెం నిర్వహించడం అభినందనీయమని, ఆయన సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని, పాల్గొన్న క్రీడాకారులకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. రోటరీ క్లబ్ ద్వారా కూడా అవయవ దానం పై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు, కొవ్వూరు గ్రాండ్ అధినేత కొవ్వూరు రమేశ్ రెడ్డి మాట్లాడుతూ తాను 2003లో లివర్, తర్వాత కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకున్నానని, ఆరోగ్యంగా వున్నానని, నడక దారిలో తిరుమల కొండకు వెళ్లానని, విజయవాడ కనకదుర్గమ్మ ను నడక ద్వారా వెళ్లి దర్శించుకున్నానని వివరించారు. తనకు లివర్ అందించిన స్వర్గీయ స్వప్న జ్ఞాపకార్థం తాను ప్రతి సంవత్సరం మార్చి 11న వైద్యశిబిరాలు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ అవయవ దానం చేసి మరి కొందరికి జీవితాన్ని ప్రసాదించాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే వరద వరదరాజులరెడ్డి కి, విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఈ పరుగుపందెం పోటీలలో 5కె రన్ విభాగంలో అనిల్ కుమార్, శ్రీను, వెంకట్రామిరెడ్డి, 3కె రన్ బాయ్స్ విభాగంలో చంద్రశేఖర్, వెంకట లోకేష్, సుధీర్, గర్ల్స్ విభాగంలో లక్ష్మి శాంతి, అవంతి రాణి, కళ్యాణీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచి 10,000, 7,000, 5,000 నగదు బహుమతి, 1.5కె విభాగంలో చెన్నకేశవ రెడ్డి, భీమ శంకర్ రెడ్డి, బాలన్న 7000, 5000, 3000 నగదు బహుమతి గెలుపొందారు. పాల్గొన్న దాదాపు 3000 మంది క్రీడాకారులకు మెడల్స్ అందించారు.

# రాజంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా గ్రంధే సత్యనారాయణ గుప్త ఎన్నిక



**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

రాజంపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ( అమ్మవారి శాల ), లో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో సంఘం అధ్యక్షునిగా గ్రంధే సత్యనారాయణ గుప్త ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికకు సంబంధించి ఉత్కంఠ పోరులో తుమ్మలపెంట పాల ప్రకాష్ పై గ్రంధే సత్యనారాయణ గుప్త 18 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తుమ్మలపెంట పాల ప్రకాష్ కు 195 ఓట్లు రాగా, గ్రంధే సత్యనారాయణ గుప్తకు 213ఓట్లు వచ్చాయి. అధ్యక్ష పోటీలో ఉన్న మరో అభ్యర్థి అన్నం సుబ్బరాయుడు కీ 27 ఓట్లు వచ్చాయి. అధ్యక్ష పదవికి ఎన్నికైన గ్రంధే సత్యనారాయణ గుప్త గతంలో 2 మార్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికై ఉన్నారు. ఇప్పుడు గెలవడంతో మూడోసారి రాజంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మూడేళ్లపాటు సత్యనారాయణ గుప్త పనిచేయనున్నారు. తుమ్మలపెంట పాల ప్రకాష్ ఒకమారు అధ్యక్షుడిగా పని చేశారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన అన్నం సుబ్బరాయుడు గతంలో కూడా అధ్యక్ష పదవికి పోటీ చేయడం జరిగింది. ఈ మారు కూడా అధ్యక్ష ఎన్నికల్లో అన్నం సుబ్బరాయుడికి నిరాశే ఎదురయింది. సంఘంలో మొత్తం 7 వార్డులు ఉండగా 1, 2, 3, 4, 6, 7 వార్డులకు 18 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం 5వ వార్డుకు 3గురు సభ్యుల ఎన్నికకు సంబంధించి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో సన్నిశెట్టి వెంకటేష్, పబ్బతి సత్యం, తుమ్మలపెట్ట సుబ్బారావులు వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి జరిగిన త్రిముఖ పోటీలో విజయం సాధించిన గ్రంధే సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధితో పాటు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ సర్వతోముఖాభివృద్ధికి, ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఆర్యవైశ్యులు ఉండటంతో ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు మున్సిపల్ ఎన్నికల రీతిన అట్టహాసంగా ప్రచారం అధ్యక్ష పదవికి పోటీపడ్డ అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. మొత్తానికి ఆర్యవైశ్య సంఘం ఎన్నికలను పట్టణంలో అన్ని వర్గాల ప్రజల ఆసక్తిగా ఎదురుచూడటం విశేషం. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇతర ప్రాంతాల్లో నివాసం ఉన్న ఆర్యవైశ్యులు కూడా తరలివచ్చారు. ఆర్యవైశ్య సంఘం బైలాస్ ప్రకారం ఆర్యవైశ్య కుటుంబాలల్లో ఒక్కో కుటుంబానికి ఒక ఓటు మాత్రమే సంఘం కార్యవర్గ ఎన్నికలకు వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం ముగిసే సరికి మొత్తం 493 ఓట్లకుగాను 444 ఓట్లు పోలయ్యాయి. 9 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఒకొక్క వార్డుకు ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. 5 వ వార్డు కు నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేయడంతో ఆ వార్డుకు ఎన్నిక అనివార్యం అయింది. కాగా గ్రంధే సత్యనారాయణ గుప్త విజయం సాధించడంతో ఆయన వర్గీయలు అమ్మవారిశాల వద్ద పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చారు.

# దొంగతనం కేసును గంటల వ్యవధిలో చేధించిన పోలీసులు



**ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒంటిరి మహిళా నుండి ఆభరణాలు అపహరించిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు గంటల వ్యవధిలోనే కేసును చేధించి అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై ఆదివారం స్థానిక టూ టౌన్ పోలీసు స్టేషనులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్పీ భావన మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున సుమారు 4.45 గంటల సమయములో మొఖం కనపడకుండా తలకు మంకీ క్యాప్ మరియు చేతులకు గ్లోజులు వేసుకొని వచ్చిన ఒక గుర్తు తెలియని వ్యక్తి స్థానిక అంద్రకేసరి రోడ్డు లోని డోర్ నెం.7/1562 1 గల యింట్లో నివాసము ఉంటున్న ఆర్యవైశ్య కులమునకు చెందిన తుమ్మలపెంట సుబ్బయ్య భార్య ప్రభావతి అనే మహిళను తన యింటి వద్ద బెదిరించి, ఆమె వద్ద నుండి సుమారు 10 లక్షల రూపాయలు విలువ చేసే సుమారు 12 తులాల బరువు కలిగిన ఒక బంగారు తాళిబొట్టు సరుడు, 6 తులాల నాలుగు బంగారు గాజులు అపహరించుకొని పోయాడని బాధితురాలు తుమ్మలపెంట ప్రభావతి ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు 2 టౌన్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి విచారణ జరిపే క్రమంలో జిల్లా ఎస్పీ, ప్రొద్దుటూరు డిఎస్పీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు 2 టౌన్ సిఐ యుగంధర్, ఎస్సైలు ధనుంజయుడు, రాఘవేంద్రా రెడ్డి, కానిస్టేబుళ్ల రవీంద్ర నాయక్, మహబూబ్ బాష, బాబాఫకృద్దీన్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పలుకోణాలలో విచారణ చేస్తూ సాయత్రం 4.30 గంటలకు టూ టౌన్ బైపాస్ రోడ్డులోని మానసా రెస్టారెంట్ ప్రక్కన గల మారుతీ అపార్ట్మెంట్ కు పోయే దారిలో ప్రొద్దుటూరు టౌన్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులో నివాసము ఉంటున్న ఉచ్చుసా గారి రసూల్ ను అదుపు లోకి తీసుకొని విచారించామని వివరించారు. ఈ విచారణ లో తుమ్మలపెంట ప్రభావతి తన భర్తతో పాటుగా ప్రొద్దుటూరు 3 టౌన్ పోలీసు స్టేషన్ ప్రక్కన జనరల్ స్టోర్‌ను నిర్వహిస్తుండగా, సుమారు రెండు సంవత్సరాల నుండి ముద్దాయి రసూల్ అందులో గుమస్తాగా పనిచేసేవాడని రసూల్ తన ముక్కుకు ఆపరేషన్ చేయుంచుకొను నిమిత్తము జనవరి ఒకటవ తేదినుండి గుమాస్త పనికి రాలేనని, డిసెంబర్ నెల జీతముతో పాటుగా, ఆపరేషన్‌కు అదనంగా 10వేల రూపాయలను యిమ్మని అంగడి యజమాని అయిన సుబ్బయ్యను అడిగాడని, అయితే సుబ్బయ్య ఆపరేషన్ చేయించుకొన్న తర్వాత యిస్తానని చెప్పినట్లు, ఆపరేషన్ చేయించుకొన్న తర్వాత రసూల్ తన జీతం డబ్బులు గురించి సుబ్బయ్యను అడగగా, అతను ఇవ్వకుండా కాలయాపన చేశారని తెలిపారు. ఈ క్రమంలో వారి ఇబ్బంది పెట్టాలని దొంగతనానికి పాల్పడినట్లు తేలిందన్నారు. అతని వద్ద నుండి సుమారు 10 లక్షల రూపాయలు విలువ చేసే సుమారు 12 తులాల బరువు కలిగిన ఒక బంగారు తాళిబొట్టు సరుడును మరియు నాలుగు బంగారు గాజులను మరియు నేరానికి ఉపయోగించిన అతని బజాజ్ డిస్కవరీ మోటార్ సైకిల్ ను రికవరీ చేసినట్లు వివరించారు. ఈ కేసు ఛేదనలో విశేష ప్రతిభ కనబరిచిన ప్రొద్దుటూరు 2టౌన్ సిఐ యుగంధర్, ఎస్సైలు ధనుంజయుడు, రాఘవేంద్రా రెడ్డి, కానిస్టేబుళ్ల రవీంద్ర నాయక్, మహబూబ్ బాష, బాబాఫకృద్దీన్‌ని ప్రొద్దుటూరు డిఎస్పీ ప్రత్యేకంగా అభినదించారు.

# పైపు లైన్ లికేజి.. పట్టించుకోని అధికారులు

**కమలాపురం ఫిబ్రవరి 09 ప్రభాతవార్త**

నగర పంచాయతీ పరిధిలో ఆర్ఎస్ రోడ్డు అప్పయ్యపల్లె సమీపంలో తాగు నీటి పైపు పగిలి గత 15 రోజుల నుంచి నీళ్లు వృధా అవుతున్న దానిద్వారా నీరు కలుషితం అవుతున్నాయి ఆవిషయం ఎవరు పట్టించుకోవడంలేదని అక్కడ ఉన్నవారు అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం ఈ రోడ్డు మీదుగా తిరుగుతున్న అధికారులు కూడా పట్టీ పట్టనట్లు అంటి అంటినట్లు వ్యవహరిస్తున్నారని అక్కడున్నవారు తెలిపారు ఇప్పటికైనా నగర పంచాయతీ అదికారులు స్పందించి లికేజీ అవుతున్న పైపు లైన్ కు మరమ్మతులు చేసి ప్రజల ఆరోగ్యం కాపాడాలని తెలిపారు.



# మంత్రులకు విజయమ్మ, రితేష్‌ల వినతి

: సానుకూలంగా స్పందించిన మంత్రులు



**బద్వేలు , ఫిబ్రవరి 9 , ప్రభాతవార్త :**

బద్వేలు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి మంత్రి సబితకు, మైనార్టీ శాఖా మంత్రి ఫరూఖ్‌కు బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నాయకులు రితేష్‌రెడ్డిలు కలిసి ఆదివారం విజ్ఞప్తి చేశారు. కాశినాయన క్షేత్రం అభివృద్ధి విషయంలో అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని, దానిపై ప్రత్యేక దృష్టిపెట్టి భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత కొద్ది నెలలుగా అటవిశాఖాధికారులు క్షేత్రాన్ని అభివృద్ధి చేయకూడదని ఆంక్షలు విధించడంతో మంత్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. బద్వేలులో ఎక్కువ శాతం డీకేటీ నివాసాలు, స్థలాలు ఉన్నందున వాటిని క్రమబద్ధీకరించాలని చాలా రోజుల నుంచి వినతులు ఇవ్వడం జరిగిందని, దీనిపై గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని, స్థలాలు క్రమబద్ధీకరించడం వలన మున్సిపాలిటీకి ఆదాయం పెరిగి అభివృద్ధి జరుగుతుందన్నారు. బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాలలో షాదీ ఖానాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రులు త్వరలో పరిష్కారం చూపుతామని విజయమ్మ, రితేష్‌లకు హామి ఇచ్చారు.



# విశ్వ ల్యాపరోస్కోపి అండ్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వరద



**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

పొద్దుటూరు పట్టణం గాంధీ రోడ్డు సూపర్ బజార్ రోడ్డు ఎదురుగా డాక్టర్ జయలక్ష్మి డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విశ్వ ల్యాపరోస్కోపి అండ్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ను ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు అవసరమైన అందించే సేవల గురించి డాక్టర్ జయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని చికిత్సకు ఉపయోగపడే పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ గైనకాలజికి సంబంధించిన లాప్రోస్కోపి సేవలను ప్రొద్దుటూరు నగరంలోని అందిస్తున్నామని ఇతర పెద్దపెద్ద నగరాలకు పోవాల్సిన అవసరం లేదన్నారు. ఇన్‌ఫెర్టిలిటీకి సంబంధించిన మగవారికి గాని ఆడవారికి గాని అవసరమైన సేవలు అందిస్తామన్నారు. మహిళలకు సంబంధించిన పెద్ద పెద్ద గడ్డలు క్యాన్సర్ సంబంధించిన చికిత్సను స్పెషలిస్ట్ డాక్టర్లను పిలిపించి ఇక్కడే అందిస్తున్నామన్నారు. శని ఆది వారాలలో స్పెషలిస్ట్ డాక్టర్లను పిలిపించి అన్ని రకాల జబ్బులకు తగిన సేవలు అందిస్తున్నామన్నారు. కార్డియాలజి సర్జన్ డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ గుండెకు సంబంధించిన అంది చికిత్సలను ఇక్కడ చేస్తున్నామని వివరించారు బైపాస్ సర్జరీ సమయంలో గుండె కోతకు ఎక్కువ గురి చేయకుండా కేవలం మూడు చోట్ల హోల్స్ పెట్టి బైపాస్ సర్జరీ పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే గుండెకు సంబంధించి హోల్స్ పడిన స్టంట్స్ కూడా వేయబడునన్నారు. పెద్ద పెద్ద నగరాలకు వెళ్లకుండా అన్ని రకాల గైనకాలజిస్ట్ మరియు కార్డియాలజీకి సంబంధించిన సేవలు ప్రొద్దుటూరులోనే అందిస్తున్నామని తెలుపుటకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన నృత్య ప్రదర్శన



**పులివెందుల రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

పులివెందులలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కోలా ప్రసాద్ ఆర్థిక సహకారంతో మదనపల్లెకు చెందిన సూర్య డ్యాన్స్ అకాడమీ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదివో అల్లదివో శ్రీహరివాసము అంటూ సాగే ఈ పాటతో మొదలై గోదారి గట్టు మీద రామ సిలకవే, ఎక్కొ బండెక్కు మావా, లాలాగూడా లంబడి పిల్లా, అలిబిల్లి సోకులాడి సిట్టమ్మి తదితెర పాటలకు చిన్నారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ సూర్య, పరిపాలనా అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

# నులిపురుగుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

**వేంపల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**



నులిపురుగుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తాళ్లపల్లి పీ హెచ్ సి సిహెచ్‌ఓ వెంకటరత్నం అన్నారు. ఆదివారం వేంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 17న మాఫ్ అప్ డే సందర్భంగా గైర్హాజరైన పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. 119 ఏళ్ల వయసు పిల్లలకు అల్బెండజోల్ తప్పనిసరిగా ఇవ్వాలని, ప్రభుత్వం వీటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఫకృద్దీన్, వెంకటలక్ష్మి, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

# గంగమ్మ జాతరలో మంత్రి



**చిన్నమండెం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం చాకిబండ అంపబతునివారి పల్లెలోని అనంతపురం గంగమ్మ జాతరలో పాల్గొని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించిన శ్రీనివాసులు ఆహ్వానం మేరకు మంత్రివర్యులు వారి ఇంటికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు శివశంకర్ రెడ్డి

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**



చక్కటి ప్రణాళిక, కఠిన శ్రమ, అంకిత భావం ఉంటే ఐదు పదుల వయసులో కూడా రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్‌లో పథకాలు సాధించవచ్చును. ఇందుకు నిదర్శనంగా గంగనపల్లి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శివ శంకర్ రెడ్డి నిలిచారు. ఫిబ్రవరి 7 వ తేదీ నుండి 9వ తేదీ వరకు అనంతపురం జిల్లా పిటిసి గ్రౌండ్ నందు జరిగే ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ లో 45+ వయసు విభాగంలో హై జంప్, లాంగ్ జంపు నందు రెండు బంగారు పథకాలు సాధించారు. ట్రిపల్ జంప్ నందు వెండి పతకం సాధించి మార్చి 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు బెంగళూరు నందు జరిగే జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు బొగ్గేటి. శివ శంకర్ రెడ్డి ఎంపికైయారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులతో పాటు నేను సాధన చేయడం వలనే పథకాలు సాధిస్తున్నానని వెల్లడించారు. పట్టుదల ఉంటే సాధించలేనిది లేదు అన్నారు. నిరంతర సాధనమే విజయానికి ముఖ్యమన్నారు. జాతీయ స్థాయిలో కూడా పథకం సాధిస్తానని చెప్పారు.

# ఆత్మలింగేశ్వర స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట

**చిన్నమండెం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**



మండలంలోని కేశాపురం గ్రామ కస్పాలో వెలసిన ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో శని, ఆదివారం ధ్వజస్తంబ ప్రతిష్ఠ అర్చకుల వేదమంత్రాల మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు ఏర్పాటు చేసి వేదపండితులు పూజాలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు చేసారు. అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కుకొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. పెద్దయత్తున అన్నదానం ఏర్పాటు చేసారు.

# గోదాదేవి (ఆండాల్)అలంకారంలో స్వామివారు

**రామసముద్రం. ఫిబ్రవరి9 ప్రభాతవార్త**



మండల కేంద్రంలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వేడుకలలో భాగంగా 6వ రోజు ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి బటర్, కులశేఖర్ బటర్, ఉదయం శ్రీ వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అంగరంగ వైభవంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, నిర్వహించి గోదాదేవి (ఆండాల్)అలాంకరణలో భక్తులకు ఉంజల సేవ నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారిని చూసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి వారిని దర్శనం కల్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద రాత్రి ఆంజనేయ స్వామి భజన సంఘం ఎలవానెల్లూరు వారిచే సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు.

# వీక్షకులను ఆకర్షించిన చిన్నారి నృత్యాలు



**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**

కడప శిల్పారామంలో ఆదివారం సా.6 గం.లకు ఆటవిడుపులో భాగంగా సాంస్కృతిక కళావేదిక మీద మిష్పా మూవీ వారి సహకారంతో పులివెందులకు చెందిన ఎస్.కె డాన్స్ అకాడమీ వారు పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకుల మదిని ఆకర్షించాయి. బావా బావా, గోదావరి గట్టు మీద రామ చిలుకవే, ఆయుధపూజ అంటూ స్టెప్‌లతో ప్రేక్షులును అల్లరించినాయి. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి పి.శివ ప్రసాద్ రెడ్డి, ఫీల్డ్ సూపర్వైజర్ మధుసూదన్ బాబు పర్యవేక్షించారు.

# పద్యకవి జలకనూరికి ఘన సత్కారం

**పీలేరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

పీలేరు వాసి, పద్యకవి జలకనూరి మురళీధర్ రాజుకు ఘన సత్కారం లభించింది. వైయస్సార్ జిల్లా రచయితల సంఘం పిలుపు మేరకు కడప, శంకరాపురంలోని ఐయంఏ హాలులో ఫిబ్రవరి 8,9 తేదీల్లో రెండు రోజుల పాటు "వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం రాయలసీమ భాగస్వామ్యం" సాహిత్య, సంస్కృతిలో రాయలసీమ వైభవం అనే అంశాలపై కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో పీలేరుకు చెందిన జలకనూరి మురళీధర్ రాజు రాయలసీమ, కవులు, భాష, యాస, పండుగలు, ఆచార వ్యవహారాలు, శాసనాలు, స్వాతంత్ర్య సమరయోధులు కళాకారులు, శ్రామిక జీవన విధానాలపై "నా రాయల సీమ రతనాల సీమ" అనే పద్యాన్ని పద్య గానంతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. అలాగే రాయల సీమ కవులు, శ్రీ కృష్ణ దేవరాయలు, అల్లసాని పెద్దన, నాచన సోమన, అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మాం మొదలగు వారిపై ఆట వెలది, కందము, సీస పద్యాలు రాసి వినిపించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు, కవులు జింకా సుబ్రమణ్యం, అధ్యక్షులు మూల మల్లికార్జున్ రెడ్డి, ఆచార్య వెలుగొంద నిత్యానందరావు, గానుగ పెంట హనుమంతరావు చేతుల మీదుగా శాలువా సన్మానించి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని నాకు తెలిసి సత్కరించారు.

